గుంతలమయంగా రహదారులు

- వర్షాలకు అధ్వానంగా తయారైన రోడ్లు
- మరమ్మతులు చేపట్టని ప్రభుత్వం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు


గుంతలమయంగా గుర్రంపోడు రోడ్డు


చండూరు రహదారిలో కుంగిన కల్వర్టు

గుర్రంపోడు : మండలంలో కనీస మరమ్మతులకు కూడా ఏళ్లతరబడి నోచుకోకుండా రహదారులు గుంతలమయంగా మారి ప్రమాదకరంగా ఉన్నాయి. మండల పరిధిలో 26కిలోమీటర్ల పొడవునా నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారి, 13 కిలోమీటర్ల పొడవునా గల గుర్రంపోడు- చండూరుల మధ్య రహదారి, నడికూడ మీదుగా ముక్కాముల వరకు 15కిలోమీటర్ల రహదారిపై ఏర్పడ్డ గుంతలు ప్రస్తుత వర్షానికి పెద్దవిగా మారి ప్రమాదకరంగా తయారయ్యాయి. నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారిపై అడుగుకొక గుంతగా మారింది. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గుర్రంపోడు మండల కేంద్రం శివారులో నిజాం కాలం నాటి బ్రిడ్జి గుంతలమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. ఈ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని కొంతకాలంగా ప్రజలు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మొసంగి మీదుగా తమ్మడపల్లి వరకు గల రోడ్డు బీటీ లేచిపోయి కంకరమయంగా మారింది.

కాజ్‌వేలు బ్రిడ్జిలుగా మారేదెప్పుడో?

మండలంలో పలు గ్రామాల మధ్య గల కాజ్‌వేల మీద నీరు వర్షాకాలంలో జీవనదుల్లా పారుతున్నాయి. అమలూరు- బొల్లారం మధ్య, లక్ష్మీదేవిగూడెం రోడ్డులో, సుల్తాన్‌పురం- వెంకటాపురం గ్రామాల మధ్య కాజ్‌వేలను బ్రిడ్జిలుగా మార్చాల్సి ఉంది. దీంతో కాజ్‌వేలు వర్షాకాలంలో పాకురు పట్టి ఉండటంతో వాహనాలు జారిపడుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మొసంగి - కొత్తలాపురంల మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో గుర్రంపోడు వాగు ప్రవహించినప్పుడు తరుచూ రోడ్డు తెగి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఆమలూరు- చేపూరుల మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మాణం జరగక ఆమలూరు గ్రామస్తులు వర్షాకాలంలో చుట్టూ తిరిగి ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణించి తమ వ్యవసాయ బావుల వద్దకు చేరుకోవాల్సి వస్తుంది. మండలంలో పలు గ్రామాల మధ్య లింక్ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నందున వర్షాకాలంలో తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి


మండలంలో ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. తక్షణమే కనీస మరమ్మతులు చేపట్టకపోతే చండూరు రోడ్డులో ఆర్టీసీ బస్సులు నడవని పరిస్థితి ఉంది. ప్రమాదాలు పొంచి ఉన్నందున రోడ్లపై మట్టిపోసైనా గుంతలు నింపాలి.

– నూదిని జగదీశ్వర్‌రెడ్డి పిట్టలగూడెం

ప్రతిపాదనలు పంపాం


మండలంలో రోడ్ల మరమ్మతులకుగాను ప్యాచ్ వర్క్స్‌కు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కావల్సి ఉంది. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రమాదకరంగా ఉన్న గుంతల్లో మట్టి పోయాలని సర్పంచ్‌లకు ఇప్పటికే సూచించాం.

– శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ

క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో జైవీర్‌రెడ్డి పూజలు

హాలియా : పట్టణంలోని షిర్డీ సాయి బాబా దేవాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువనాయకులు కుందూరు జైవీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జైవీర్‌రెడ్డిని ఆలయ కమిటీ చైర్మన్ తేలప్రోలు శేఖర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మిట్టపల్లి వాసులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, నాయకులు పాంపాటి శ్రీనివాస్, సాగర్‌రెడ్డి, జగన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి గ్రామపంచాయతీలోని సర్వే నంబర్ 117లో ఎకరం స్థలాన్ని కుమ్మరి సంఘానికి కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి సంఘం యూత్ అధ్యక్షులు ఎలిమినేటి సాయి, నియోజకవర్గ అధ్యక్షులు తోటపల్లి కిరణ్, నీలకంఠం రాములు, మాడ్గుల యాదగిరి, బొడ్డుపల్లి ఎల్లయ్య, తోటపల్లి శ్రీనివాసులు, బొడ్డుపల్లి వంకర్, ఎలిమినేటి ఆంజనేయులు, చిలువేరు శ్రీధర్, మేడిపల్లి జంగయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


బొల్లంపల్లి రాములు అధ్యక్షుడు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడిగా బొల్లంపల్లి రాములు, ఉపాధ్యక్షులుగా నేలపట్ల మల్లేశ్, కార్యదర్శిగా గుద్దేటి ఆంజనేయులు, కోశాధికారిగా నేలపట్ల గిరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాములు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న గోపీచంద్

డిండి : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపీచంద్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు పురుగులతో కూడిన అన్నం, ఎక్కువ శాతం నీళ్లతో కూడిన పప్పుచారు, ఉడకని కూరగాయలు పెడుతున్నారని ఘటనా స్థలానికి ఎంఈఓ సామ్యానాయక్‌ను పిలిపించి వివరించడం జరిగిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని లేకపోతే ఏబీవీపీ తరుపున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట కార్తీక్, ఈశ్వర్, సీతారాం, నితిన్, శరత్, ఆంజనేయులు, అరవింద్ పాల్గొన్నారు.

బ్యాగులు, నోటుబుక్స్ పంపిణీ


విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న యూత్ ఫర్ సేవా సంస్థ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం యూత్ ఫర్ సేవా సంస్థ-నల్లగొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ పరశురామ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు వెళ్లాలన్నారు. గురువుకు, పుట్టిన ఊరుకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పద్మావతి, నాగలత, గోపాలపు రాజు, ఆ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్లు మన్నెం వెంకట్, స్వామి, సభ్యులు శివ పాల్గొన్నారు.

'పోడు' పట్టాల పంపిణీలో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని 1138 మంది లబ్ధిదారులకు పట్టాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. గిరిజనుల ఏళ్ల నాటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. దశాబ్దాల పోడు భూముల సమస్యకు సీఎం కేసీఆర్ శాశ్వత పరిష్కారం చూపించారన్నారు. పోడు పట్టాలు అందివ్వడంతో పాటు రైతుబంధు, రైతుబీమా వర్తింపజేయడం రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజనులపై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, వంగాల ప్రతాప్‌రెడ్డి, బాలునాయక్, వల్లపురెడ్డి, ఏటీడీఓ రాజ్‌కుమార్, టీవీఎస్.రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, వద్యా బాలు పాల్గొన్నారు.

పార్వతమ్మకు ఎమ్మెల్యే నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : మండలంలోని మధారిగూడెం గ్రామానికి చెందిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిస్టమ్ ఆపరేటర్ కుందారపు వెంకటేశ్వర్లు మాతృమూర్తి పార్వతమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నోముల భగత్ మధారిగూడెం గ్రామంలో బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్వతమ్మ మృతదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదే విధంగా అనుముల ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సంపత్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సత్యం, స్థానిక సర్పంచ్ కుందారపు సైదులు, మార్కెట్ డైరెక్టర్లు పోషం శ్రీనివాస్ గౌడ్, పాదిల శ్రీనివాస్, పేరూర్ సర్పంచ్ నాగరాజు, దేవస్థానం చైర్మన్ రాయనబోయిన రామలింగయ్య, బొమ్ము సైదులు, రావులపాటి వెంకటయ్య, మల్లిఖార్జున్ ఉన్నారు.

ఎమ్మెల్యే టికెట్ ఇస్తే పోటీకి సిద్ధం


మాట్లాడుతున్న పొలిటికల్ జేఏసీ చైర్మన్ చింతల వెంకటేశ్వర్లు యాదవ్

హాలియా : తెలంగాణ ఉద్యమంలో పొలిటికల్ జేఏసీ చైర్మన్‌గా ఉద్యమకారుడిగా గుర్తింపు ఉన్న తనకు వచ్చే శాసనసభ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ సాగర్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ బాధ్యులు చింతల వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పొలిటికల్ జేఏసీ చైర్మన్‌గా తాను సుదీర్ఘకాలంగా ఉద్యమాన్ని ముందుండి నడిపించానన్నారు. 2002లో సీఎం కేసీఆర్ సాగునీటి కోసం చేపట్టిన పాదయాత్రలో హాలియా నుంచి సాగర్ వరకు కేసీఆర్ పాదయాత్రలో తానూ ఈ ప్రాంత వందలాది మంది రైతులను తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. 2021లో సాగర్‌లో నిర్వహించిన ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అధిష్టానం నుంచి పిలుపు వచ్చినప్పటికీ అప్పుడున్న పరిస్థితుల్లో తాను ముందుకు రాలేకపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో తాను కొనసాగు తున్నప్పటికీ అధిష్టానం ఆదేశించి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇస్తే ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలుగుల చిన వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అర్వనబోయిన వెంకన్న, గోవింద్, చిలుకల కాశి, పంగ గోవింద్, కృష్ణారెడ్డి, కామసాని శేఖర్‌రెడ్డి, పంగ శ్రీను, గుండెబోయిన నరేష్, కనకరాజు బ్రహ్మం బొల్లెపల్లి నరేష్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి మృతి బాధాకరం

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని కోదండాపురం గ్రామానికి చెందిన వంట్టెద్దు శ్రీనివాస్‌రెడ్డి మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం వంట్టెద్దు శ్రీనివాస్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, వల్లపురెడ్డి, ఏడుకొండల్‌యాదవ్, పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి


నాగార్జున సాగర్ : మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనూష


మాడుగులపల్లి : మొక్కలను పంపిణీ చేస్తున్న మౌలాలీ, అధికారులు

మాడుగులపల్లి : హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ మౌలాలీ కోరారు. మండలంలోని తోపుచర్ల గ్రామంలో బుధవారం ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. తెలంగాణను పచ్చని నందనవనంగా తీర్చిదిద్దేందుకే సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీత, పాఠశాల హెచ్‌ఎంలు శ్రీనివాస్, సాంబశివారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, షేక్ హుస్సేన్ షేక్ జరీనా బేగం, బొమ్మనపాలెం వెంకటయ్య, వల్లపుదాసు రాములు, బొడ్డు లింగయ్య యాదవ్, మారేపల్లి వెంకన్న, నన్నెబోయిన పద్మ తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

నాగార్జునసాగర్ : ప్రతి ఒక్కరూ విధిగా ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను చేపట్టాలని నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ కర్ణ అనూష అన్నారు. బుధవారం ఆమె మున్సిపాలిటీ పరిధిలో హరితహారం కార్యక్రమంలో భాగంగా కమిషనర్ రవీందర్‌రెడ్డితో కలిసి ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేసి మాట్లాడారు. చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలని వినతి


నల్లగొండలో డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ఎస్ఎఫ్ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ప్రైవేట్ పాఠశాలో అధిక ఫీజులను నియంత్రించాలని కోరుతూ బుధవారం నల్లగొండలో డీఈఓ భిక్షపతికి టీఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చ సైదులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలకు పైగా అవుతున్నప్పటికి పూర్తి స్థాయిలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, దుస్తులు అందలేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని, లేని యడల ఆ పాఠశాల గుర్తింపులను తక్షణమే రద్దు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్, పందీఫ్, ఆర్. రమేష్‌నాయక్, సందిఫ్, కాశయ్య, తదితరులున్నారు.

ఆర్టీఐను పకడ్బందీగా అమలు చేయాలి

మాడుగులపల్లి : ఆర్టీఐ చట్టాన్ని పకబ్బందీగా అమలు చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి మేడి రాజు కోరారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మాడుగులపల్లి మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఒక పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు ఇచ్చేందుకు వెళ్తే సిబ్బంది కార్యదర్శి అందుబాటులో లేడని తిరస్కరించడంతో చేసేది లేక రిజిస్టర్ పోస్టు చేయాల్సి వచ్చిందని తెలిపారు.

ఆసియాలోనే అతిపెద్ద సంఘం పీఆర్‌టీయూ

పెద్దవూర : 52 ఏళ్ల చరిత్రతో 78 వేల సభ్యత్వాలతో ఆసియా ఖండంలోనే పీఆర్‌టీయూ అతిపెద్ద సంఘం అని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని 18 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పే స్కేలు కోసం ప్రభుత్వంతో పీఆర్‌టీయూ చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. పెండింగ్ బిల్లుల సమస్యలు, పదోన్నతులు, బదిలీలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పీఆర్‌టీయూ సభ్యత్వాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్, రాష్ట్ర బాధ్యులు నాయకులు కె.శ్రీనివాస్, సక్రు నాయక్, హిమవంతరెడ్డి, వడ్లపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు దండ వీరారెడ్డి, దుర్గాప్రసాద్, దేవేందర్, శైలజ, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, వాసు, విజయారెడ్డి, కుంభ పార్వతి, రవీందర్, శంకర్ పాల్గొన్నారు.


పెద్దవూరలో పీఆర్‌టీయూ సభ్యత్వాన్ని అందిస్తున్న కమలాకర్‌రావు

పెద్దఅడిశర్లపల్లి : పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కమలాకర్ జిల్లా అధ్యక్షులు ఫణికుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు మూనా, తిరుమలరావు, జానారెడ్డి, శ్రీనివాస్, సరళ, మల్లేష్, లక్ష్మి, పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ అర్బన్ : ఫిబ్రవరి 7న నిర్వహించిన ఒలింపియాడ్‌లో పట్టణంలోని ఆదిత్య పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మారుతీ అమరేందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు జి.గణేష్ రాష్ట్ర స్థాయి 7వ ర్యాంకు సాధించగా ఎల్.అక్షయ 12వ ర్యాంకు సాధించారని, అదే విదంగా కె.శేష్టరెడ్డి వ్యాసరచనలో 14వ ర్యాంకు, సుఫియా తరున్నం 19వ ర్యాంకు మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఎన్.వెంకట్ 20వ ర్యాంకు సాధించారని తెలిపారు. అంతేగాకుండా స్నేహిత, కార్తికేయ, సంజన, మహిత, భవాని, శేష్ట, లక్ష్మారెడ్డి, అఖిల, భయ్య, అశ్రిత, చైత్రిక, నేహా, మహేందర్‌రెడ్డి, హుస్సేన్ లు అత్యంత ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు మెమొంటోలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట


చీరలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

గుర్రంపోడు : ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో పీహెచ్‌సీలో జన ఆరోగ్య సమితి సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలకు, ఆశా వర్కర్లకు చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీపాద సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నారెడ్డి, మండల వైద్యాధికారి భవాని చక్రవర్తి , సూపర్‌వైజర్ సైదులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ద్వారా విస్తృత సేవలు

నిడమనూరు : లయన్స్ క్లబ్ ద్వారా గ్రామాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టవచ్చని ముఖ్య అతిథి, లయన్స్ క్లబ్ గవర్నర్ రామానుజా చార్యులు అన్నారు. నిడమనూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా కట్టెబోయిన గురవయ్య నేతృత్వంలో నూతన కార్యవర్గం బుధవారం ప్రామాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా మండలంలోని శాఖాపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 13ఏళ్ల కిందట మొదటి సారిగా 120మంది సభ్యులతో చేకూరి హన్మంతరావు అధ్యక్షతన నిడమనూరు క్లబ్ ప్రారంభమైందన్నారు. అది ఇప్పటికీ రికార్డ్ గానే ఉన్నదన్నారు. మండలంతో పాటు పుష్కరాల సమయల్లోనూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. అధ్యక్షుడు కట్టెబోయిన గురవయ్య, కార్యదర్శిగా కాసోజు తిరుపతాచారి, అశోక్, సభ్యులతో లయన్స్ క్లబ్ ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ యారాల ప్రభాకర్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు లయన్స్ క్లబ్ ఫౌండర్ చేకూరి హన్మంతరావు, లయన్స్ క్లబ్ బాధ్యులు కోడె సతీష్‌కుమార్, గట్టుపల్లి అశోక్ రెడ్డి, యర్రమాద శ్రీనివాస్, పాంపాటి శ్రీనివాసులు, కొప్పోజు శ్రీనివసా, కొండా శ్రీనివాస రెడ్డి, వెంకటేశ్వర్లు, పేరయ్య, చేకూరి సూర్య నారాయణ, పోలే డేవిడ్, మధు, ఉన్నం చిన వీరయ్య, మట్టపల్లి రావు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

త్రిపురారం : ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియేట్‌లో అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని చెన్నాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఓపెన్ స్కూల్ కోర్డినేటర్ లావురి వెంకన్న, సహాయ కోఆర్డినేటర్ మాలోతు దశరథ నాయక్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువును మధ్యలో ఆపేసిన వారు, ఆర్థిక ఇబ్బందులతో రెగ్యులర్‌గా చదువును కొనసాగించలేనివారు కనీస విద్యార్హతలు ఉన్నవారు ఓపెన్‌లో పదో తరగతి చదవడానికి అవకాశం ఉందని తెలిపారు. పదో తరగతి పాస్ అయిన వారు ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. రికార్డు షీట్, ఆధార్ కార్డు, పాస్ ఫొటో, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలు, ఇంటర్ అడ్మిషన్ కోసం పదో తరగతి పాస్ మెమో, టీసీ, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో రావాలని సూచించారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

చింతపల్లి : బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ నిర్వహణ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్‌ను బుధవారం చింతపల్లి మండల బీజేపీ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శివర్ల రమేశ్‌యాదవ్, కాసోజు బ్రహ్మాచారి, గోపిడి అనిల్‌రెడ్డి, పర్వతాలు, లక్ష్మణ్‌సాగర్, శ్రీను తదితరులున్నారు.


ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

365 రోజులకు చేరిన మీల్స్ ఆన్ వీల్స్


అల్పాహారం పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం బుధవారం 365 రోజులకు చేరుకుందని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రోగుల సహాయకులకు ఉచితంగా అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 104 మంది దాతలు ముందుకు రావడానికి సహకరించిన లయన్ గట్టుపల్లి రవీందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యారాల ప్రభాకర్ రెడ్డి, కోడె సతీష్‌కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ పుల్లారావు, సహాయ కోఆర్డినేటర్ బండా సాగర్‌రెడ్డి, దుబ్బాక వెంకట్‌రెడ్డి, రీజియన్ పర్సన్ గట్టుపల్లి అశోక్‌రెడ్డి, వెంకన్న, ఎర్రమాద శ్రీనివాస్, అయితగోని మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ : పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ కార్యాలయం, క్లాక్ టవర్ సెంటర్ నుంచి రామగిరి, ఎస్పీ కార్యాలయం ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున ప్రజలు సహకరించాలని కోరారు.

బాధితుడికి ఆర్థిక సాయం

తిరుమలగిరి(సాగర్) : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన నగేష్‌ను బుధవారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలం వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, సర్పంచ్ శ్రావణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏడీ రామాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో అనేక కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల యజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు, యూనిఫాం, పుస్తకాలు, డైరీలు పేర్లతో వేలాది రూపాయలను దండుకుంటున్నారని అన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేవారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వినోద్, వంశీ, శశిధర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.